



నేటి నుంచి 'నిజం గెలవాలి' కార్యక్రమం

చంద్రబాబు అరెస్టు సమయంలో చనిపోయిన వారి కుటుంబాలకు నారా భువనేశ్వరి పరామర్శ - 5లో



అల్లవరంలో మైన్స్ పేరిట హైదరాబాద్ బిల్లుతో జరిమానా విధించిన దృశ్యం

మైన్స్ పేరిట హైదరాబాద్ బిల్లులు

ప్రైవేట్ బిల్లులతో వసూళ్ల దందా

అల్లవరం, జనవరి 23: తమ పంటపొలాల్లో మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుంటే మైన్స్ పేరిట ప్రైవేట్ కాంట్రాక్టర్ అక్రమ దందాతో జరిమానాలు విధిస్తున్నట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పొలాల్లో మట్టిని పల్లపు ప్రాంతాలకు తరలిస్తుంటే కాంట్రాక్టర్ సిబ్బంది దాడులు చేసి మైన్స్ పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. కాంట్రాక్టు సిబ్బంది దాడులు చేసి ఫోటోలుతీసి ట్రాక్టరుకు రూ.316 జరిమానా విధిస్తూ సుధాకర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ పేరున బిల్లులు ఇస్తున్నారన్నారు. తాము తోటలు మెరక చేయడానికి నల్లమట్టి తరలిస్తే జరిమానా వేయడం ఏమిటని, ప్రైవేట్ వ్యక్తులకు జరిమానా ఎందుకు కట్టాలని ప్రశ్నిస్తున్నారు. దీనిపై కొందరు బాధిత రైతులు ట్రాక్టర్ యాజమానులు రాష్ట్రమంత్రి పినిపే విశ్వరూప్ దృష్టికి తీసుకువెళ్లారు. హైదరాబాద్‌కు చెందిన సుధాకర్ ఇన్‌ఫ్రా మైనింగ్ కాంట్రాక్టును పొందింది. అనేకచోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి ఇసుక, మట్టి తరలింపులపై నిఘా పెట్టింది. చార్జీలు చెల్లించకుండా వెళితే అక్కడికక్కడే జరిమానాలు విధిస్తోంది. చివరకు రైతులు పొలాల్లో తీసిన మట్టిపై సైతం జరిమానాలు విధించడాన్ని రైతులంతా వ్యతిరేకిస్తున్నారు. మంత్రులు, కలెక్టర్, మైనింగ్ శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని అక్రమ వసూళ్లు ఆపాలని కోరుతున్నారు.

నాట్లు నేలచూపు



సాగునీరందక బీటలు తీసిన పొలం.. (కింద) వాడపర్రు కాల్వలో పూడిక తీస్తున్న దృశ్యం

- సాగునీటి కోసం నోళ్లు తెరుస్తున్న వరి పొలాలు
- వాడపర్రు పంటకాల్వ పరిధిలో బీటలువారిన పొలాలు
- కనీసం తోడుకునేందుకైనా నీరిప్పించండని రైతుల అభ్యర్థన
- ఆలస్యంగా స్పందించిన అధికారులు.. కాల్వలో పూడికతీత
- నాట్లు బతికించుకోవాలన్న తపనతో కూలీలైన రైతులు

ఉప్పలగుప్తం, జనవరి23: ఆరంభంలో వర్షాలకు నారుమళ్లు నాశనమయ్యాయి. రెండోసారి అన్నదాతలు నారు పోసుకుని అతికష్టంతో నాట్లు వేసుకున్నారు. ఈలోపు పంటకాల్వకు నీటి ప్రవాహం ఆగిపోయింది. దాళ్వా చేలు బీటలు వారాయి. నాట్లు చచ్చిపోతున్నాయి.. ఇదీ లక్ష్మీవాడ-వాడపర్రు పంటకాల్వ శివారు రైతుల వ్యథ. నీటి ముంపుతో సార్వా పంటకు నోచుకోక ఆర్థిక చిక్కుల్లో పడిన రైతులు ఇప్పుడు నీటి కొరతతో ఎండిపోతున్న దాళ్వా నాట్లను చూసి లబోదిబోమంటున్నారు. అయినాపురం ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో లక్ష్మీవాడ- వాడపర్రు పంటకాల్వ అయినాపురం ప్రధాన పంటకాల్వ నుంచి 13 కి.మీ మేర కూనవరం వరకు విస్తరించివుంది. ఈ కాల్వ శివారు ఆయకట్టుకు సాగునీటి కష్టాలు సాధారణమే. అయితే గతంకంటే ప్రస్తుత పరిస్థితి భిన్నంగా ఉంది. గతంలో పంట మధ్యకాలంలో నీటి కొరత ఉండేది. ఇప్పుడు ఆదిలోనే చేలు ఎండిపోతున్నాయి. కనీసం కాల్వ నుంచి తోడుకునేందుకు కూడా నీరులేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు. చాలారోజులుగా నీటి ఇబ్బందులను అధికారులకు మొరపెట్టుకుంటున్నా స్పందన లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విసిగిపోయిన రైతులు అధికారులతో ఘర్షణకు దిగారు. దాంతో అధికారులు కాల్వలో పూడిక



తీతకు ఒక ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటుచేశారు. మిగిలిన పనులన్నీ రైతులే స్వయంగా చేసుకుంటున్నారు. కాల్వలో పూడిక తీసినంతమాత్రాన పొలాలకు నీరు ప్రవహిస్తుందా అనేది ప్రశ్నే. కాల్వలో తగినంత నీటిమట్టం ఉంటేనే ఇది సాధ్యం. శివారుకు నీరందాలంటే కుండలేశ్వరం వియర్ వద్ద నీటి మట్టం నాలుగు అడుగులు దాటి ఉండాలి. అయితే అక్కడి పరిస్థితి ఎలా ఉంది? ఏ కారణంగా నీరు రావడం లేదు. వారంలో ఏఏ రోజుల్లో తగినంతగా నీరు అందుబాటులో ఉంటుంది? ఈ విషయాలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులదే. రైతులు, అధికారుల మధ్య సమన్వయ లోపం వల్ల సాగునీటి కొరత అంశం వివాదాలకు దారితీస్తోంది. గతంలో నీటి సంఘాలే ఈ సమస్యలను పరిష్కరించేవి. ఇప్పుడు పట్టించుకునే వారే లేరు.



నాట్లు ఎండిపోతున్నాయి..

నాట్లు వేసి రెండు వారాలు అయ్యింది. ప్రస్తుతం నాట్లు చచ్చిపోతున్నాయి. కాల్వ నుంచి ఏదోవిధంగా తోడుకుందామన్నా నీరు లేదు. తొలకరి పంట వర్షాలతో పోగొట్టుకున్నాను. ప్రస్తుతం మూడు ఎకరాల్లో నాట్లు వేసి పొలం ఎండిపోతుంటే ఏమీ చేయలేని పరిస్థితి. ఈ సమస్యకు పరిష్కారం చూపించాలి.

- బొక్కా శ్రీనివాసరావు, రైతు, వాడపర్రు

కాంట్రాక్టర్ సకాలంలో స్పందించక ఇబ్బంది ఏర్పడింది..

లక్ష్మీవాడ- వాడపర్రు పంటకాల్వ సన్నవిల్లి నుంచి శివారు వరకు నిత్యం పూడికతో నిండి ఉంటుంది. ఈ కాల్వపై ఏటా రైతులకు నీటికష్టాలు తప్పడంలేదు. సమస్య పరిష్కారానికి మా వంతు కృషి కొనసాగిస్తున్నాం. కాంట్రాక్టర్ సకాలంలో స్పందించక పోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. ప్రస్తుతం ఒక యంత్రం ద్వారా పూడిక తీయిస్తున్నాం. ఒక పక్క ఆర్థిక ఇబ్బందులున్నాయి. కుండలేశ్వరం వియర్ వద్ద 4.3అడుగుల నీటి మట్టం ఉంది. పూడికతీత అనంతరం నీటి ఇబ్బందులు తొలగిపోతాయి.

- శివరామకృష్ణ, ఇరిగేషన్ ఏఈ, అయినాపురం సెక్షన్

ఖరీఫ్ సీజన్‌లో 2,19,334 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు : జేసీ

అమలాపురం టౌన్, జనవరి 23: ఖరీఫ్ సీజన్ 2023-24కు సంబంధించి జిల్లాలో 330 రైతు భరోసా కేంద్రాల ద్వారా 2,19,334 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 42,009 మంది రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసినట్టు జేసీ నుపూర్‌అజయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకై జిల్లాలో గతేడాది నవంబరు 6న 374 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. రూ.478.51 కోట్లు విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేయగా ఇప్పటివరకు రూ.471 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలకు జమచేశామన్నారు. మిగిలిన రూ.7.51 కోట్లు రైతులకు చెల్లించేందుకు బ్యాంకులకు పంపించామన్నారు. ఈ నెలాఖరు వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఖరీఫ్ సీజన్‌కు పనిచేస్తాయన్నారు. 30న ఆర్బీకేలను మూసివేయడం జరుగుతుందని ఈలోపున రైతులు తమ వద్ద మిగిలి ఉన్న ధాన్యాన్ని ఆర్బీకేలకు తరలించి మద్దతు ధర పొందాలని, కొనుగోలుపై ఎటువంటి సందేహాలు ఉన్నా జిల్లా కంట్రోల్ రూము నంబరు 9183094-32487ను సంప్రదించాలని జేసీ కోరారు.



తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా మంగళవారం నాడు ముమ్మిడివరంలోని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహరావు నివాసంలో కేక్ కట్ చేస్తున్న అమలాపురం పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్, టీడీపీ ఇతర నేతలు - ముమ్మిడివరం



ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీల విజయోత్సవ సభ దృశ్యం

డిమాండ్ల అమలుకు తక్షణం చర్యలు తీసుకోవాలి

అంగన్‌వాడీల విజయోత్సవ సభలో సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం

అమలాపురం టౌన్, జనవరి 23: జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీల అమలు కోసం అంగన్‌వాడీలు 42 రోజులు నిరవధిక సమ్మెలో పాల్గొనగా, ఎట్టకేలకు ప్రభుత్వం దిగివచ్చి హామీల అమలు ఉత్తర్వులు ఇవ్వడంతో మంగళవారం అమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట విజయోత్సవ సభ నిర్వహించారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వం అంగీకరించిన అంశాల అమలుకు తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు విజయ, కె.బేబిగంగారత్నం, జిల్లా కోశాధికారి పి.అమూల్యలు మాట్లాడుతూ సమ్మెకు సంఘీభావం ప్రకటించిన రాజకీయ పార్టీలకు, ప్రజాసంఘాలకు, సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఎటువంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా ఉద్యోగుల హక్కులను గౌరవించాలని కోరారు. విజయోత్సవ సభలో జి.దైవకృప, రత్నకుమారి, మణిమాల పాల్గొన్నారు.

గుండెపోటుతో అంగన్వాడీ కార్యకర్త మృతి - 5లో



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న డీఆర్వో సత్తిబాబు, ఇతర అధికారులు

ఎన్నికల్లో మద్యం, నగదు సరఫరా అడ్డుకోవాలి

సరిహద్దుల్లో చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలి : డీఆర్వో సత్తిబాబు

అమలాపురం, జనవరి23(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటర్లను అన్నివిధాలుగా ప్రలోభాలకు గురిచేసే మద్యం, నగదు విచ్చలవిడిగా రవాణా కాకుండా సరిహద్దు ప్రాంతాల చెక్‌పోస్టుల వద్ద నిఘా వ్యవస్థలను పటిష్టంగా ఏర్పాటు చేయాలని డీఆర్వో సీహెచ్ సత్తిబాబు సంబంధిత అధికారులకు సూచించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న అనంతరం సత్తిబాబు మాట్లాడారు. ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్వయించుకుని సిబ్బంది ముందుకు సాగాలన్నారు. బ్యాంకర్లు అధిక మొత్తంలో నగదు విత్‌డ్రా చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. వాణిజ్య పన్నుల శాఖ చెక్‌పోస్టు ఓటర్లను ప్రభావితం చేసే రీతిలో బహుమతిగా ఇచ్చే వెండి, బంగారు ఆభరణాలు రవాణా కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎస్‌ఈబీ అధికారులు మద్యం అక్రమ రవాణాపై దృష్టి సారించాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజన్సీలు చేసిన తనిఖీల ద్వారా పట్టుబడ్డ వస్తువుల వివరాలను ఆన్‌లైన్ రిపోర్టింగు కోసం కమిషన్ ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టంను అభివృద్ధి చేసినట్టు డీఆర్వో తెలిపారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఈఎస్‌ఎంఎస్ విధానాన్ని అమలుచేస్తామని చెప్పారు. లీడ్ బ్యాంకు మేనేజర్ కె.శ్యామ్‌బాబు, డీఎఫ్‌వో ఎంవీ ప్రసాదరావు, కలెక్టరేట్ సెక్షన్ అధికారి పి.సుబ్రహ్మణ్యం, పరిపాలనాధికారి కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి

పది పరీక్షల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి

ముమ్మిడివరం, జనవరి 23: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలను సాధించి జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని పాఠశాలల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని మండల విద్యాశాఖాధికారులు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు ముమ్మిడివరంలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో 73.48 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో జిల్లా 13వ స్థానంలో నిలిచిందన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పది పరీక్షా ఫలితాల్లో అన్ని పాఠశాలలు నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా హెచ్‌ఎంలు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షలను ఆధారంగా చేసుకుని వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.కమలకుమారి మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 18 నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు జిల్లా నుంచి 1894 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఇప్పటి వరకు 23 రివిజన్ టెస్టులు నిర్వహించామని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవిధంగా ప్రణాళిక రూపొందించామన్నారు. సీనియర్ ఎంఈవో బొజ్జా రమణశ్రీ, విద్యా శాఖ ఏడీ నక్కా సురేష్, డీసీఈబీ కార్యదర్శి బి.హనుమంతరావు, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు డీవీవీ సుబ్రహ్మణ్యం, డి.రమేష్‌బాబు, పి.రాంబాబులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు రూ.254.24 కోట్ల ఆసరా



డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న మంత్రి, కలెక్టర్ శుక్లా

డ్వాక్రా రుణమాఫీకి కట్టుబడ్డ ప్రభుత్వం : మంత్రి విశ్వరూప్

అమలాపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తానని ఇచ్చిన హామీకి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన బహిరంగ సభలో డ్వాక్రా సంఘాలకు నాల్గో విడత వైఎస్సార్ ఆసరా నిధులను పొదుపు సంఘాల ఖాతాలకు సీఎం జగన్ వర్చువల్ విధానంలో మంగళవారం జమచేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ డ్వాక్రా రుణమాఫీ చేస్తానని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలుపుకుందన్నారు. స్వయం సహాయక సంఘ సభ్యులకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. కలెక్టర్ హిమాన్షుశుక్లా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నాల్గో విడతలో 31,093 డ్వాక్రా సంఘాలకుగాను రూ.254.24 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. ఈసందర్భంగా డ్వాక్రా మహిళలకు ఆసరా నమూనా చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌ఖాదర్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, ఏపీడీ ఎంఎం జిలానీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతుండగానే.. మహిళలు తిరుగుముఖం

అల్లవరం, జనవరి 23: అల్లవరం మండలం కోడూరుపాడు వద్ద మంగళవారం జరిగిన వైఎస్సార్ ఆసరా సభ వద్ద మహిళలు గంటల తరబడి వేచి ఉండలేక సభ నుంచి వెళ్లిపోయారు. మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావులు పాల్గొన్న ఈ సభలో మంత్రి, ఇతర వక్తలు మాట్లాడుతుండగానే మహిళలు ఒక్కసారిగా సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఎవరూ వెళ్లవద్దని చెబుతున్నా వినిపించుకోకుండా వెళ్లిపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు అయోమయానికి గురయ్యారు. అనంతరం రూ.11.47 కోట్ల నాల్గో విడత ఆసరా నమూనా చెక్కును విడుదల చేశారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, జడ్పీటీసీ కొనుకు గౌతమి, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్, ఎంపీడీవో కృష్ణమోహన్, తహశీల్దార్ ప్రసాద్‌లు పాల్గొన్నారు.



కోడూరుపాడులో ఆసరా సభ నుంచి వెళ్లిపోతున్న డ్వాక్రా మహిళలు

నేటి నుంచి 'నిజం గెలవాలి' కార్యక్రమం

చంద్రబాబు అరెస్టు సమయంలో చనిపోయిన వారి కుటుంబాలకు నారా భువనేశ్వరి పరామర్శ

ఉమ్మడి జిల్లాలో మూడు రోజుల పర్యటన



కాకినాడ సిటీ, జనవరి 23: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అక్రమ అరెస్టుతో వేదనకు గురై కొంతమంది మరణించడంతో వారి కుటుంబాలను పరామర్శించేందుకు చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి..' కార్యక్రమంలో భాగంగా బుధవారం నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో నిర్బంధించిన సమయంలో వేదనకు గురై అశువులు బాసిన వారి కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించి ఆర్థిక సాయం అందించనున్నారు.

మూడురోజుల పాటు పర్యటన

24న కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గం, 25న అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గం, 26న రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గంలో పర్య టించనున్నారు. బుధవారం మధ్యాహ్నం 11.30 గంటలకు భువనేశ్వరి మధురపూడి విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి 12.30 గంటలకు జగ్గంపేట మండలం గుర్రపాలెం, 1.25 గంటలకు పెద్దాపురం మండలం కాండ్రకోట, సాయంత్రం 4.05 గంటలకు తుని రూరల్ మండలం తేటగుంట, 5.20 గంటలకు కాకినాడలోని 26వ డివిజన్‌లో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శిస్తారు. రాత్రికి ముమ్మిడివరం నియోజకవర్గం మహిపాల చెరువువద్ద జాతీయ రహదారి పక్కన గ్రాండ్ పార్క్ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో బస చేస్తారు. 25న గురువారం ఉదయం 10.30 గంటలకు పి.గన్నవరం నియోజకవర్గం అయినవిల్లి మండలం ఎస్.మూలపాలెం, 11.45 గంటలకు అమలాపురం నియోజకవర్గం ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి, 12.25 గంటలకు అల్లవరం మండలం రెల్లుగడ్డ, 2.40 గంటలకు రాజోలు నియోజకవర్గం మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం, సాయంత్రం 5.25 గంటలకు మండపేట నియోజకవర్గం కపిలేశ్వరపురం మండలం నల్లూరు, 6.20 గంటలకు మండపేట మండలం పాలతోడు గ్రామంలో పర్యటిస్తారు. రాత్రికి అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం బలభద్రపురం చేరుకుని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో బస చేస్తారు. 26న శుక్రవారం ఉదయం 10.25గంటలకు బిక్కవోలు, 12.40 గంటలకు నిడదవోలు మండలం పందలపర్రు, 1.20 గంటలకు తిమ్మరాజుపాలెం, 1.55 గంటలకు తాడిమళ్ల, 3.15 గంటలకు గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లి, సాయంత్రం 4.30 గంటలకు రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలం కాటవరంలో పలు కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు మధురపూడి విమానాశ్రయం నుంచి ఆమె హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు.

మహిళా వాలీబాల్ పోటీల విజేత
సౌత్ సెంట్రల్ రైల్వే



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

మలికిపురం, జనవరి 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం తూర్పుపాలెంలో నాలుగు రోజులు పాటు జరిగిన జాతీయ మహిళా వాలీబాల్ టోర్నమెంట్ సోమవారం అర్ధరాత్రి ముగిసింది. సౌత్ సెంట్రల్ రైల్వే టీమ్ విజేత కాగా ఐసీఎఫ్ టీమ్ ద్వితీయ స్థానంలో, కేరళ పోలీసు టీమ్ తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు ఎస్పీ ఎస్.శ్రీధర్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామంలో జాతీయ వాలీబాల్ టోర్నమెంటు నిర్వహించిన ఏసీఎఫ్ ఫౌండేషన్‌ను అభినందించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ చైర్మన్ అడబాల వేణుగోపాల్, అడబాల బ్రహ్మాజీ, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, అడబాల తాతకాపు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, రంకిరెడ్డి కాశీ, అల్లూరి రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్వీర్యం

ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ



చంద్రబాబు సాగర్‌ను పరిశీలిస్తున్న సత్యప్రభ

ప్రత్తిపాడు, జనవరి23: ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఇరిగేషన్ శాఖకు చెందిన సాగునీటి ప్రాజెక్టులు అనేక సమస్యల్లో చిక్కుకుని నిరుపయోగంగా మారాయని, దీని వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. నియోజకవర్గంలోని ఏలేరు సాగునీటి ప్రధాన జలాశయంతో పాటు సుబ్బారెడ్డి సాగర్, చంద్రబాబు సాగర్ ప్రాజెక్టులను మంగళవారం ఆమె టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సందర్శించారు. ఈ ప్రాజెక్టులు అధ్వాన తీరు పట్ల సత్యప్రభ నాయకత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యప్రభ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని కనీస మరమ్మత్తులకు నోచుకోలేదని అన్నారు. చంద్రబాబు సాగర్‌కు రెండు దశాబ్దాలుగా కాలువల ఏర్పాటు జరగలేదన్నారు. సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టుకు వరదల సమయంలో పడిన గండ్లు పూడ్చలేదని, ఏలేరు ప్రాజెక్టు ఆధునికీకరణకు నోచుకోలేదని రాజ్యాంగ సమస్యల పరిష్కారం కోసం తాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి కోసం జగన్ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించిందని చెప్పారు. ప్రభుత్వ నిర్లక్ష్యం మెట్ట ప్రాంత రైతులకు శాపంగా మారిందని సత్యప్రభ దుయ్యబట్టారు. అనంతరం ప్రాజెక్టుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో నియోజకవర్గ టీడీపీ నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, కొమ్ముల కన్నబాబు, అమరాది వెంకట్రావు, బొల్లు కొండబాబు, జల్లిగంపల ప్రభాకరరావు, బొదిరెడ్డి గోపాలకృష్ణ, సూది బూరయ్య, మిరియాల శ్రీను, బొండాడ నారాయణ, బొల్లు వెంకటేశ్వరరావు, రొంగల సత్యనారాయణ, తటవర్తి సుబ్బారావు, లొండా లోవరాజు, సూది ప్రభాకర్, రావూరి తాతాజీ, రామిశెట్టి మున్నిబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు భరోసాతో..

గిరిజన యువతలో చిగురిస్తున్న ఆశలు!

గిరిజన ప్రాంతాల్లో నూరుశాతం ఉద్యోగాలు

గిరిజనులకేనన్న బాబు

జీవో 3 పునరుద్ధరణకు అరకు సభలో హామీ

(రంపచోడవరం): జగన్ ప్రభుత్వ తీరుతో నైరాశ్యంలో ఉన్న గిరిజన యువతకు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పర్యటన ఉద్యోగ భరోసాను కల్పించి కొత్త ఆశలను చిగురింపజేసింది. ఇటీవల అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో నిర్వహించిన 'రా కదలి రా' కార్యక్రమంలో జీవో నంబరు 3 పునరుద్ధరణకు చంద్రబాబు హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో అన్ని ఉద్యోగాలూ గిరిజనులకే దక్కేవిధంగా తెలుగుదేశం ప్రభుత్వం దివంగత ఎన్టీరామారావు సారథ్యంలో 1986లోనే నడుం బిగించింది. అన్ని ఉపాధ్యాయ పోస్టులూ గిరిజనులతోనే భర్తీ చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఉత్తర్వులను రద్దు చేయాలంటూ పలు కేసులు నడిచాయి. తెలుగుదేశం ప్రభుత్వం కూడా అంతే దీటుగా గిరిజనులకు అండగా నిలిచి సుప్రీంకోర్టు వరకూ పోరాడింది. రాజ్యాంగపరంగా గిరిజనులకు అండగా ఉన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని 2000 సంవత్సరంలో అన్ని ఉపాధ్యాయ పోస్టులను గిరిజనులకే దక్కే విధంగా జీవో నెం.3ను తీసుకొచ్చి, 1986 నుంచి వర్తించేలా గిరిజన యువతకు రక్షణ కల్పించింది. ఇదే పరంపరను క్రమేణా అన్ని పోస్టులకు వర్తింపచేస్తూ వచ్చారు. అనేక నియామకాలు ఆ జీవో పరిధిలోనే చేపడుతూ గిరిజన ప్రాంతాల్లో ఉండే గిరిజన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను పెంచుతూ వచ్చారు. ఆ జీవోపై కూడా పలు కేసులు దాఖలయ్యాయి. మూడు దశాబ్దాల కాలంగా గిరిజన యువత ఉద్యోగాలకు భరోసాగా నిలిచిన ఆ జీవోపై చేబ్రోలు లీలా ప్రసాదరావు కేసులో ప్రభుత్వ వైఫల్య వాదనల కారణంగా చివరకు 2020 ఏప్రిల్‌లో ఆ జీవో సుప్రీంకోర్టులో వీగిపోయింది. ఆ తీర్పుతో గిరిజన యువతకు గిరిజన ప్రాంతాల్లో నూరు శాతం ఉద్యోగ భరోసా ప్రశ్నార్థకమైంది. జనాభా ప్రాతిపదికన కేవలం 6నుంచి 7శాతం మాత్రమే గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు గిరిజనులకు దక్కే దుస్థితి కలిగింది. గిరిజనులకు అండగా నిలవాల్సిన వైసీపీ ప్రభుత్వం ఆ జీవోను పునరుద్ధరించే దిశగా సరైన చర్యలు తీసుకోలేకపోయింది. ఈ పరిస్థితుల్లో విద్యావంతులైన గిరిజన యువత ప్రభుత్వ నియామకాలు పొందలేని స్థితిలో మైదాన ప్రాంతాలకు వలసపోతూ చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి భరోసా లేక గిరిజన యువత దిక్కుతోచని స్థితిలో కుంగిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో శనివారం అరకులోయకు వచ్చిన చంద్రబాబు ఈ అంశంపై దృష్టి సారించి తమ ప్రభుత్వం గిరిజన యువతకు నూరుశాతం ఉద్యోగ భరోసా కల్పిస్తూ ఇచ్చిన జీవోను జగన్ ప్రభుత్వం కాపాడలేకపోయిందని, తద్వారా గిరిజన యువత భవిష్యత్‌ను దెబ్బతీసిందని ఆక్షేపించారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే జీవో 3 పునరుద్ధరణకు అవసరమైన చట్టపరమైన చర్యలన్నిటినీ తీసుకుంటామని స్పష్టం చేశారు. దీంతో గిరిజన యువతలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. కాగా, జీవో 3 పునరుద్ధరణ హామీ ద్వారా గిరిజన యువతకు తమ పార్టీ భరోసా కల్పిస్తోందని, భవిష్యత్‌కు గ్యారంటీ విధానంలోనే గిరిజన యువతకు చంద్రబాబు అండగా నిలుస్తున్నారని టీడీపీ సీనియర్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూ రమేశ్, వంతల రాజేశ్వరి తెలిపారు.

గుండెపోటుతో అంగన్వాడీ కార్యకర్త మృతి

ప్రభుత్వం, పోలీసుల బెదిరింపులే కారణమంటున్న సంఘం నేతలు



శేషారత్నం



నివాళులర్పిస్తున్న అంగన్వాడీలు

మండపేట, జనవరి 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం కేశవరంలో అంగన్వాడీ వర్కర్ సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి.... కేశవరానికి చెందిన అంగన్వాడీ వర్కర్ చంద్రమళ్ల శేషారత్నం (50) సోమవారం 'చలో విజయవాడ'కు బయల్దేరింది. ఆ సమయంలో ఆమెతో పాటు పలువురు అంగన్వాడీలను మండపేట రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఇప్పనపాడు పోలీసుస్టేషన్‌కు తరలించారు. సాయంత్రం విడిచిపెట్టారు. సమ్మె చేస్తున్న వారిపై ఆంక్షలు విధించడం, విధుల్లో చేరకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించడం, పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పుడు నాన్‌బెయిలబుల్ సెక్షన్ కింద కేసు నమోదు చేస్తామని బెదిరించడంతోనే శేషారత్నం ఒత్తిడికి గురై గుండెపోటుతో మృతి చెందిందని సహచర అంగన్వాడీలు చెబుతున్నారు. శేషారత్నం మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. శేషారత్నం మరణ వార్త తెలిసిన వెంటనే సీఐటీయూ, అంగన్వాడీ నాయకులు ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన హత్యేనని అంగన్వాడీలు ఆరోపించారు. శేషారత్నం కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మెలో పాల్గొని ఆందోళనకు గురై రాష్ట్రంలో మరణించిన అంగన్‌వాడీల కుటుంబాలకు న్యాయం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ కాకినాడ జిల్లా కార్యదర్శి చంద్రమళ్ల పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, పోలీసుల వేధింపుల కారణంగానే శేషారత్నం మృతి చెందిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి ఆరోపించారు. శేషారత్నం మృతి పట్ల అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు బేబీ, పద్మ, ఎంపీపీ ఉండమట్ల వాసు, దూలం వెంకన్నబాబు, ఐసీడీఎస్ సీడీపీవో గజలక్ష్మి సంతాపం తెలిపారు.

సంక్షేమ పథకాలకు కేంద్రం చేయూత

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భాగెల్



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ఎస్‌పీ సింగ్ భాగెల్

నిడదవోలు, జనవరి 23: కేంద్రం రాష్ట్రంలో పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలకు నిధులు అందించి చేయూతనందించిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ఎస్‌పీ సింగ్ భాగెల్ అన్నారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో మంగళవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం రాష్ట్రాల్లో వంద శాతం నిధులతో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఒకప్పుడు గ్యాస్ కనెక్షన్ కోసం నెలలు తరబడి వేచి ఉండేవారని ఇప్పుడు అడిగిన వెంటనే గ్యాస్ కనెక్షన్ అందిస్తున్నామన్నారు. దేశంలో స్వచ్ఛ భారత్ ద్వారా పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్రం అందిస్తున్న ప్రోత్సాహకాలతో పేదలు అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్నప్రియ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు, మండలాధ్యక్షుడు మాట్ల వెంకటదుర్గారావు, కోడూరి లక్ష్మీనారాయణ, పరిమి రాధ, రేలంగి శ్రీదేవి, అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లవకుశలో నటించడం పూర్వజన్మ సుకృతం



కుశుడు పాత్రధారి(మధ్యలో)

పెద్దాపురం, జనవరి 23 : సంచలనాత్మక పౌరాణిక చిత్రం లవకుశలో కుశుడు పాత్రలో తాను నటించడం తన పూర్వ జన్మ సుకృతమని కుశుడు పాత్రధారి వియ్యూరి నాగ సుబ్రహ్మణ్యం అన్నారు. పట్ట ణంలోని ప్రముఖ న్యాయవాది చిటికిన కనకదుర్గారావు ఇంటికి వచ్చిన నాగసుబ్రహ్మణ్యం పాత్రికేయులతో మాట్లాడారు. లవకుశ సినిమాలో నటించిన వారందరూ మరణించగా తాను మాత్రమే జీవించి ఉన్నానన్నారు. తన సోదర పాత్రధారి అయిన నాగరాజు లవుడు పాత్రలో తనతో గట్టిగా పోటీపడ్డారన్నారు. ఆయన కూడా మరణించడం తనకు ఎక్కువ బాధను కలిగించిందన్నారు. లవకుశ సినిమా తర్వాత సీతా రామ కల్యాణం, వెలుగునీడలు, శ్రీవెంకటేశ్వర మహత్యము సినిమాలలో నటించిన తర్వాత వెండితెరకు దూరమయ్యానన్నారు. బతుకుదెరువు కోసం బుర్రకథలు చెప్పడం ప్రారంభించి సుమారు పది వేల బుర్రకథలు చెప్పి నాజర్ తర్వాత ద్వితీయ రికార్డును సాధించానన్నారు. ఒక దశలో తాను మరణించానని సామాజిక మాధ్యమాలలో ప్రసారం జరిగిందని ఆ దశలో లవకుశలమైన నాగరాజు తాను పత్రికల ద్వారా తిరిగి వెలుగులోకి వచ్చి అనేక సన్మానాలు పొందామన్నారు. పుట్టా సోమన్నచౌదరి, చిట్టెం హరిగోపాలశర్మ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్కంఠగా లాన్ టెన్నిస్ పోటీలు



హోరాహోరీగా టెన్నిస్ పోటీ జరుగుతున్న దృశ్యం

కాకినాడ రూరల్, జనవరి 23: 67వ జాతీయస్థాయి బాలుర లాన్ టెన్నిస్ పోటీలు 4వ రోజు మంగళవారం ఉత్కంఠగా కొనసాగాయి. 19 సంవత్సరాలలోపు బాలురకు నిర్వహిస్తున్న ఈపోటీలు బుధవారం ముగియనున్నాయని పాఠశాల విద్య జోన్-2 ఆర్డీడీ జి.నాగమణి తెలిపారు. పోటీలు కాకినాడ డీఎస్ఏ, డీమార్ట్ సమీపంలోగల స్మార్ట్‌సిటీ టెన్నిస్‌క్లబ్, ఎస్పీ కార్యాలయం వెనుక గల టెన్నిస్ మైదానంలోనూ జరిగాయి. మొత్తం 18 మ్యాచ్‌లు నిర్వహించగా సెమీఫైనల్ మ్యాచ్‌లో రిషివర్ధన్ (కర్ణాటక)పై వహీన్‌పటేల్(గుజరాత్) 7-5 స్కోర్‌తో విజయం సాధించాడు. అర్జున్‌రాఠీ(హర్యానా) జాన్‌రోహన్(తమిళనాడు)పై 6-4 స్కోర్ తేడాతోనూ, తెలంగాణకు చెందిన శాండిల్య, అవాంపారిక్(గుజరాత్‌పై)7-5 స్కోర్‌తోనూ గెలుపొందారు. మొదటి సెమీఫైనల్‌లో తెలంగాణకు చెందిన ధీరజ్ గెలుపొందగా అర్జున్‌రాఠీ (హర్యానా), ధీరజ్ (తెలంగాణ) మధ్య బుధవారం ఫైనల్‌మ్యాచ్ జరగనుంది. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం నిర్వహించిన క్యాంప్‌ఫైర్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన లాన్‌టెన్నిస్ క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. లాన్ టెన్నిస్ జాతీయ పరిశీలకులు రామిరెడ్డి విచ్చేసి మ్యాచ్‌లను తిలకించారు. పోటీలను ఎస్‌జీఎఫ్ రాష్ట్ర చైర్మన్ జి.భానుమూర్తిరాజు, ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి బీవీవీఎస్‌వీ ప్రసాద్, అఫీషియల్స్ కె.శ్రీకుమార్, డీవైఈవోలు డేనియల్‌రాజు, సుభద్ర, డీఎస్‌డీవో బి.శ్రీనివాస్ కుమార్, ఎంఈవోలు రవి, ఏసుదాసు, శివప్రసాద్, పుల్లయ్య ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు రంగారావు, పీఈటీలు రవిరాజు, బంగార్రాజు, నూకరాజు, శ్రీనివాస్, పట్టాభి, మాసరరావు, వెంకటేష్, త్రిపుల, భానుమతి, శ్రీనివాస్, సువర్చల, మేరీ విజయ, తులసి, సత్యగౌరి, శ్రీలక్ష్మి, శ్రీహరిరాజు, హుస్సేన్, ప్రసాదరావు పర్యవేక్షించారు.

గిరిజన రైతుకు సత్కారం



గిరిజన రైతును సత్కరిస్తున్న దృశ్యం

కొవ్వూరు, జనవరి 23: టిష్యూ కల్చర్ గ్రాండ్‌నైన్ అరటి రకాన్ని శాస్త్రీయ విధానంలో సాగుచేసి అధిక దిగుబడులు సాధించిన గిరిజన రైతు ఎస్.కన్నప్పరాజును ఉత్తమ లబ్ధిదారుడిగా ఎంపిక చేసి సత్కరించినట్లు కొవ్వూరు వైఎస్ఆర్ ఉద్యాన పరిశోధన కేంద్రం ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త జి.రామానందం తెలిపారు. గుజరాత్‌లోని నవసారి వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు అఖిల భారత సమన్వయ పండ్ల పరిశోధన పథకం 11వ సదస్సు జరుగుతుందన్నారు. ఈ పథకంలో 2022-23లో నిర్వహించిన పరిశోధనా ఫలితాలపై సమీక్షించి చేపట్టవలసిన కార్యాచరణపై మంగళవారం ఆయన పరిశోధన కేంద్రంలో దిశ నిర్దేశం చేశారు. ట్రైబల్ సబ్‌ప్లాన్ కింద గిరిజన రైతుల్లో శాస్త్రీయ సాగు విధానంలో ప్రోత్సాహానికి ఆర్థిక సహాయం, నాణ్యమైన మొక్కలు, పోషకాలు, పురుగుల మందులు, సూక్ష్మ పోషకాలు, స్ప్రేయర్స్ అందిస్తోంది. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం లంకలపల్లికి చెందిన గిరిజన రైతు ఎస్.కన్నప్పరాజు టిష్యూ కల్చర్ గ్రాండ్‌నైన్ అరటి రకాన్ని శాస్త్రీయ విధానంలో సాగుచేసి రూ.4.5 లక్షల నికర ఆదాయాన్ని పొందారు. దీంతో కన్నప్పరాజును ఉత్తమ లబ్ధిదారుడిగా ఎంపిక చేసి నవసారి వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉపకులపతి జేబీ సబేల్, ఐసీఏఆర్ ఏడీజీ డాక్టర్ వీబీ పాటిల్, వైఎస్ఆర్‌హెచ్‌యూ రిటైర్డ్ ఉపకులపతి బీఎంసీ రెడ్డి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రకాష్ పాటిల్ సత్కరించారు. కన్నప్పరాజును ప్రోత్సహించిన కొవ్వూరు వైఎస్ఆర్ ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలను అభినందించారు.

నర్సరీని సందర్శించిన అంజనాసిన్హా



మొక్కలను పరిశీలిస్తున్న అంజనాసిన్హా

కడియం, జనవరి 23: కడియపులంక పుల్లా ఆంజనేయులు(అబ్బులు)-సత్యదేవా నర్సరీని మంగళవారం జాతీయ రహదారుల సంస్థ డీజీ అంజనాసిన్హా సందర్శించారు. ఆమెకు నర్సరీ అధినేత పుల్లా అబ్బులు 'జామియా' అనే మొక్కను అందజేసి స్వాగతించారు. ఈ సందర్భంగా నర్సరీలోని పలు మొక్కలు, వాటి శాస్త్రీయ నామాలు, పెరిగే తీరు, పెంపకం వంటి విషయాలను అబ్బులు కుమారుడు వీరబాబు వివరించారు. కాగా రహదారుల పరిస్థితి బాగా లేదని, మొక్కల రవాణా జరిగే ఈ ప్రాంతంలో రోడ్లు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు అంజనాసిన్హా దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళతామని ఆమె తెలిపారు.

ఆ మూడు డిగ్రీ కోర్సులు ఏఐసీటీఈ పరిధిలోకి రాకుండా చూడాలి



వీసీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దివాన్‌చెరువు, జనవరి 23: అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) పరిధిలోకి బీబీఏ, బీసీఏ, బీహెచ్ఎం కోర్సులను తీసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎఫిలియేటెడ్ కాలేజెస్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సభ్యులు తీర్మానం చేశారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో డిగ్రీ కళాశాలల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని, విశ్వవిద్యాలయాలు తమ సార్వభౌమాధికారాన్ని కోల్పోతాయన్నారు. అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ చొరవ తీసుకుని సదరు మూడు డిగ్రీ కోర్సులను ఏఐసీటీఈ పరిధిలోకి వెళ్లకుండా చూడాలని కోరుతూ అసోసియేషన్ సభ్యులు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి పద్మరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ సభ్యుడు గంధం నారాయణరావు, నన్నయ వర్సిటీ ఎఫిలియేటెడ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, అధ్యక్షుడు కేవీఆర్ఎన్ నరసింహారావు, మల్లిడి అనంతరెడ్డి, బర్ల సత్యనారాయణ, సాంబశివరావు, గంగిరెడ్డి, గణేష్ చౌదరి వివిధ డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు వర్క్‌షాపు

నన్నయ యూనివర్సిటీలో సామాజిక ఇంజనీరింగ్ యాక్సెస్, చేరిక యువ సాధికారికత ఉపాధి అనే అంశంపై బుధవారం వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్టు వీసీ కె.పద్మరాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఈ వర్క్‌షాపునకు విశ్వవిద్యాలయ ప్రాంగణాల అధ్యాపకులతో పాటు అనుబంధ కళాశాలల అధ్యాపకులు హాజరు కావాలని కోరారు. వర్క్‌షాపు కన్వీనర్‌గా ఆచార్య కె.శ్రీరమేష్, కోకన్వీనర్‌గా పి.ఉమామహేశ్వరిదేవి వ్యవహరిస్తారని తెలిపారు. వర్క్‌షాపుకు హాజరైన వారికి ఈ-సర్టిఫికెట్ అందజేస్తామన్నారు.

నేటి నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు

పెద్దాపురం, జనవరి 23: మండలంలోని చంద్రమాంపల్లి గ్రామంలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకూ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలను స్నేహ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు అధ్యక్షుడు గొందేసి రాజా తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ నాటిక పోటీలను జడ్పీ సీఈవో అబ్బిరెడ్డి రమణారెడ్డి ప్రారంభిస్తారని, అలాగే ముఖ్య అతిథిగా డీఎస్పీ లతాకుమారి హాజరవుతారన్నారు.. ఈ నాటిక పోటీలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

వై.రామవరం, జనవరి 23: అల్లూరి జిల్లా వై.రామవరం మండలంలో గంజాయి తరలిస్తున్న ముగ్గురిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డతీగల సీఐ వై.రాంబాబు ఆదేశాలతో వై.రామవరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై ముగ్గురు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. గంజాయి తరలిస్తున్న వారిలో ఒకరు మైనర్ కాగా మిగిలిన ఇద్దరు కాకినాడకు చెందిన ద్రాక్షారపు ఉమాశంకర్, వై.రామవరం మండలం పాతకోట పంచాయతీ రాచమెట్టకు చెందిన కొర్ర ఆనందరాజులుగా గుర్తించి అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామన్నారు. ఒడిసా నుంచి యార్లగడ్డ మీదుగా గంజాయిని తరలిస్తున్నారని రూ.66 వేలు విలువచేసే 22 కిలోల గంజాయిని, పల్సర్‌బైక్‌ను వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నలుగురు వైసీపీ వార్డు మెంబర్లు టీడీపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న వంతల

ఎటపాక, జనవరి 23: ఎటపాక మండలం, పురుషోత్తపట్నం పంచాయతీలోని వైసీపీకి చెందిన నలుగురు వార్డు మెంబర్లతో పాటు గ్రామానికి చెందిన న్యాయవాది, పలు కుటుంబాలకు చెందిన వారు మంగళవారం టీడీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, టీడీపీ మండలాధ్యక్షుడు పుట్టి రమేష్‌బాబు జెండా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సభలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి మాట్లాడారు. మరో మూడు నెలలో వైసీపీ పాలన ముగుస్తుందని, రానున్నది చంద్రబాబు స్వర్ణయుగమని చెప్పారు. ఆరు గ్యారెంటీ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని అన్నారు. అంతకు ముందు ఆమె పురుషోత్తపట్నంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, అరకు పార్లమెంటరీ కార్యదర్శి మువ్వా శ్రీనివాస్, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, సున్నం వెంకటరమణ, మాచినేని రాజేష్, పాటి చలపతి, ఎటపాక సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



అయోధ్యలో రామ జన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న యశోద ఆస్పత్రి చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ తేతలి దశరథ రామిరెడ్డి, అనపర్తి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి...

విజేతలకు బహుమతుల ప్రదానం

అల్లవరం: యెంట్రుకోనలో సర్పంచ్ తిక్కిరెడ్డి నాగవెంకటశ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్, క్రికెట్ పోటీల్లో విజేతలకు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ బహుమతులు ప్రదానం చేశారు. మాజీ సర్పంచ్ వాసర్ల శ్రీమన్నారాయణ, గెద్దాడ శ్రీనివాసరావు, తిక్కిరెడ్డి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం ఎస్ఐగా సురేష్‌బాబు

ముమ్మిడివరం, జనవరి 23: ముమ్మిడివరం ఎస్ఐగా టి.సురేష్‌బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రామచంద్రపురం నుంచి బదిలీపై వచ్చారు. సురేష్ బాబును పోలీసు స్టేషన్ సిబ్బంది, పలువురు నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.



రామచంద్రపురంలో రెడ్డి సుబ్రహ్మణ్యానికి కేక్ తినిపిస్తున్న రిష్వంత్‌రాయ్



రావులపాలెంలో అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న సత్యానందరావు



పి.గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు అందిస్తున్న డొక్కా నాథ్‌బాబు

వేడుకగా లోకేశ్ పుట్టినరోజు

ముమ్మిడివరం, జనవరి 23: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పుట్టినరోజును వేడుకగా నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు స్వగృహంలో మండల శాఖ అధ్యక్షుడు అర్థాని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన లోకేశ్ పుట్టినరోజు వేడుకల్లో అమలాపురం పార్లమెంటు ఇన్‌చార్జి గంటి హరీష్ మాధుర్ పాల్గొని కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పంచారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. నాయకులు గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, పొద్దోకు నారాయణ రావు, దొమ్మేటి రమణకుమార్, నడింపల్లి సుబ్బరాజు, నడిమించి సూర్యప్రభాకరం, చిక్కాల అంజిబాబు, దాట్ల బాబు, మిమ్మితి చిరంజీవి, పిల్లి నాగరాజు, కాశి లాజర్, యాళ్ల ఉదయ్, కురసాల శివబాబు, సత్తి నూకరాజు, మెండి కమల, వాసంశెట్టి అమ్మాజీ, బొక్కా రుక్మిణి, కుడుపూడి మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితా బత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు స్వగృహం వద్ద భారీ కేక్ కట్ చేశారు. నాయకులు పెచ్చెట్టి విజయలక్ష్మి, వాసంశెట్టి సుభాష్, వాసంశెట్టి సత్యం, మట్టా ఫణికుమార్, ఆవుపాటి వేణుగోపాల్, భాస్కర్ల రామకృష్ణ, నల్లా స్వామి, చిక్కాల గణేష్, బోనం సత్యవర ప్రసాద్, దాట్ల బాబు, పోతుల సుభాష్‌చంద్రబోస్, బత్తుల ప్రసాద్ పాల్గొన్నారు. టీడీపీ యువ నాయకుడు వాసంశెట్టి సుభాష్ స్వగృహం వద్ద లోకేశ్ జన్మదిన వేడుక నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన నాయకుల సమక్షంలో సుభాష్ కేక్ కట్ చేశారు. మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, పిచ్చిక శ్యామ్, మాడా మాధవి, కొండా సత్యనారాయణరాజు, బళ్ల శ్రీనివాసచక్రవర్తి, కాశిన బాబి పాల్గొన్నారు.

మండపేట: టీడీపీ కార్యాలయంలో లోకేశ్ జన్మదిన కేక్‌ను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వర రావు కట్ చేశారు. నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు యు.రాంబాబు, ముత్యాల రాజేష్, గారపాటి హరికృష్ణ, కర్రి తాతారావు, వాదా ప్రసాదరావు, వాకచర్ల గుప్తా, గుండు తాతంరాజు, కంటిపూడి శ్రీనువాస్, పాలచర్ల శిరీష్, మందపల్లి దొరబాబు, యరమాటి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: లోకేశ్ జన్మదినం సందర్భంగా టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు దారపురెడ్డి రాజా, డాక్టర్ కాదా వెంకటరమణ, మేడిశెట్టి శేషారావు, క్లస్టర్ ఇన్‌చార్జి అక్కుల రిష్వంత్‌రాయ్, టీడీపీ మండల అధ్యక్షుడు పితాని వీరభద్రరావు, డాక్టర్ రాంబాబు, రాయుడు లీలాశంకర్, టీడీపీ-జనసేన సమన్వయకర్త వైట్ల గజలక్ష్మి, జాస్తి విజయలక్ష్మి, జనసేన నాయకులు చిక్కాల దొరబాబు, సంపత్ పాల్గొన్నారు. యండగండి గ్రామానికి చెందిన చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి ఏర్పాటుచేసిన అన్నదాన శిబిరాన్ని రెడ్డి సుబ్రహ్మణ్యం ప్రారంభించి పేదలకు అన్నదానం చేశారు. తెలుగు యువత నాయకుడు చింతపల్లి అర్జున్ ఆధ్వర్యంలో ద్రాక్షారామలో జరిగిన లోకేశ్ జన్మదిన వేడుకలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు కొమరిన వీర్రాజు, గరిగిపాటి సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: టీడీపీ నియోజకవర్గ సహ కన్వీనర్ నామన రాంబాబు, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు కట్ చేశారు. ఎస్సీ సెల్ నాయకుడు నాగాబత్తుల వెంకటసుబ్బారావు సమకూర్చిన పండ్లను రోగులు, బాలింతలకు అందించారు. ఎన్టీఆర్ యువసేన అధ్యక్షుడు వక్కలంక బుల్లియ్య దుప్పట్లు పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు దంతులూరి శ్రీనురాజు, గుడాల ఫణి, నాయకులు గణపతి వీరరాఘవులు, దాసరి వీర వెంకట సత్యనారాయణ, సంసాని పెద్దిరాజు, బొంతు పెదబాబు, దొమ్మేటి సాయి కృష్ణ, అరిగెల సూరిబాబు, అరిగెల బలరామమూర్తి, మొల్లేటి శ్రీనివాస్, సుదా బాబ్జీ, చిన్నం బాలవిజయరావు, పెదపూడి శ్రీనివారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వంటిపల్లి సతీష్‌కుమార్, ఈదల నల్లబాబు, రామానుజుల శేషగిరి రావు, కడియాల శ్రీను, దండంగి మమత, సాలి సత్యనారాయణ, ఈదల రాంబాబు, వైట్ల అభి, తాడి శ్రీనివాస్‌రెడ్డి, కాలా సాయిబాబు, కేతా రాంబాబు తదితరులు పాల్గొన్నారు. జొన్నాడలో లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

కె.గంగవరం: పామర్రులో టీడీపీ సీనియర్ నాయకుడు చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంచారు. టీడీపీ, జనసేన నాయకులు మరివాడ సూరిబాబు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, మార్ని శ్రీధర్, ములకల రామచంద్రరావు, పెన్నాడ త్రిమూర్తులు, అల్లూరి దొరబాబు, పెంకే నాగేశ్వరరావు, ఈదల వాసు పాల్గొన్నారు. కె.గంగవరం ప్రధాన కూడలిలో టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. అన్నదానం జరిపారు. నాయకులు చుండ్రు వీర్రాజు చౌదరి, చొల్లంగి ఎదుర్లయ్య, కొత్తపల్లి మురార్జీ, మేడిశెట్టి రవికుమార్, బలుసు శివప్రసాద్, బలుసు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబుతో పాటు నేతలు, కార్యకర్తలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు అందించారు. సర్పంచ్ బొండాడ నాగమణి, తోలేటి సత్తిబాబు, సంసాని పెద్దిరాజు, వంకాయల బాలయ్య, రుద్రా గంగారావు, పెచ్చెట్టి ఈశ్వర్, పరమట సత్యనారాయణ, పల్లి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: టీడీపీ కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. దర్నాల రామకృష్ణ, వాసంశెట్టి సత్యనారాయణ, యల్లమిల్లి జగన్మోహన్, బీర ఇసాక్, ముత్యాల బాబ్జీ, దేవపాటి వెంకటేశ్వరరావు, కముజు వెంకటేశ్వరరావు, బయ్యే రాంబాబు, నల్లా వెంకటరమణ, విళ్ల మారుతీప్రసాద్, కాశీ రాజు, రెడ్డి శ్రీనివాస్, బూసి వెంకటరమణ, బండారు వీరన్నకాపు, కొప్పిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. అభయాంజనేయస్వామి ఆలయంలో 108 కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు జరిపారు.

అల్లవరం: టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజుతో పాటు సుమారు 20 మంది రక్తదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనంద రావు, టీడీపీ రాష్ట్ర నాయకుడు మెట్ల రమణబాబు, పెచ్చెట్టి విజయలక్ష్మి, నడింపల్లి సుబ్బరాజు, వాసంశెట్టి సుభాష్, పోతుల సుభాష్‌చంద్రబోస్, వేగిరాజు వెంకట్రాజు, కడలి వెంకటేశ్వరరావు, వేగిరాజు సుబ్బరాజు, పోతుల నాగరాజు, గుబ్బల నాగేశ్వర రావు, గొలకోటి చిన్నా, కొపనాతి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: నగరంలో టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు జాలెం సుబ్బారావు ఆధ్వర్యంలో లోకేశ్ పుట్టినరోజు కేక్‌ను సర్పంచ్ జాలెం రమణకుమారి కట్‌చేసి అభిమానులకు పంచారు. నగరం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేసి మొగలికుదురుని అనాథాశ్రమంలో భోజన సదుపాయం కల్పించారు. కోళ్ల సురేష్ బాబు, రాయుడు శ్రీనివాస్, గుబ్బల నరసింహశెట్టి, ముఖర్రం హుస్సేన్, వాణరాశి రాజబాబు, మొల్లేటి పార్వతి, జేటీ జాలెం రాజేష్ తదితరులలు పాల్గొన్నారు.

రామచంద్రపురం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో అభిమానుల సమక్షంలో టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం కేక్‌లు కట్ చేశారు. తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కుల రిష్వంత్‌రాయ్ నేతృత్వంలో మోడరన్ హైస్కూల్, గురుదేవ్ స్కూల్, ప్రగతి ఇంగ్లిషు మీడియం స్కూల్, పిల్లావారి స్కూల్‌లో విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లు, పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. తెలుగు యువత నాయకుడు రాయపురెడ్డి రాజా కుమారుడు సాయి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద 120 మంది పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు, శానిటరీ కిట్లు పంపిణీ చేశారు. టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు కడియాల రాఘవన్, యండగండి చౌదరి, మాజీ కౌన్సిలర్ అల్లం శ్రీనివాస్, వనుం చంటి, ఖండవిల్లి విజయవీరబాబు, దొమ్మలపాటి విజయలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయినవిల్లి: లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఆయన పేరిట ప్రత్యేక పూజలు జరిపించారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. విలస న్యూ లైఫ్ సెంటర్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. సలాది పుల్లయ్యనాయుడు, కళ్లేపల్లి సుబ్బరాజు, మద్దాల చంటిబాబు, కుడుపూడి దుర్గారావు, పోలిశెట్టి రాజేష్, గుమ్మడి వెంకటేశ్వరరావు, కాకర బాబ్జి, మోత వెంకటేశ్వరరావు, వర్రే శ్రీను, మద్దాల రాజా, బొబ్బిలి రాంబాబు, పెన్మెత్స సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: తాటిపాకలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బాణసంచా కాల్చి వేడుకలు జరిపారు. రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, సాగి పాపయ్యరాజు, మంగెన భూదేవి, అడబాల సాయిబాబు, బందెల పద్మ, ఈలి శ్రీనివాస్, కాండ్రేగుల భవానీ, మట్టపర్తి లక్ష్మి, పొలమూరి శ్యామ్‌బాబు, కసుకుర్తి త్రినాథస్వామి, మానుకొండ దుర్గాప్రసాద్, బేతినీడి శ్రీనివాస్, పామర్తి రమణ, రుద్రరాజు బంగార్రాజు, నాగిరెడ్డి గోపి, గుద్దటి చిట్టబ్బాయి, ఉల్లంపర్తి బాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



రాజోలు మండలం తాటిపాకలో కేక్ కట్ చేస్తున్న గొల్లపల్లి సూర్యారావు



మండపేటలో లోకేశ్ జన్మదిన వేడుకలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కార్యకర్తలు



అయినవిల్లి సిద్ధివినాయక స్వామి ఆలయంలో టీడీపీ నేతల పూజలు

అయోధ్యకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

రావులపాలెం, జనవరి 23: అయోధ్యలో రామ మందిరం దర్శనార్థం రావులపాలెం నుంచి మంగళవారం తొలి బస్సు బయల్దేరి వెళ్లిందని ఆర్టీసీ రావులపాలెం డిపో మేనేజరు కేడీఎంఎస్ కుమార్ తెలిపారు. 13 రోజుల తీర్థ యాత్రలో అన్నవరం, సింహాచలం, అరసవల్లి, పూరి, కోణార్క్, భువనేశ్వర్, సాక్షిగోపాలం, జాజిపూర్, బుద్ధగయ, వారాణశి, త్రివేణి సంగమం, సీతామడి, ప్రయోగ, అయోధ్య, నైమిశారణ్యం క్షేత్రాలను చూపిస్తారు. ఫిబ్రవరి 4వ తేదీ నాటికి బస్సు రావులపాలెం చేరుకుంటుందన్నారు.

'షర్మిల పర్యటనను విజయవంతం చేయాలి'

మండపేట, జనవరి 23: రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా గురువారం కాకినాడ విచ్చేస్తున్న వైఎస్ షర్మిల పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు పిలుపునిచ్చారు. మండపేటలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం కాకినాడలో మూడు జిల్లాల అధ్యక్షులతో పాటు నియోజకవర్గాల నేతలతో షర్మిల సమీక్షిస్తారన్నారు. నాయకులు పిల్లి అప్పన్న, కొండా దుర్గారావు, మండాది గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సమస్యలపై నిరంతర పోరాటం

అంబాజీపేట, జనవరి 23: వైసీపీ ప్రభుత్వం సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఆర్థిక సంఘాల నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో ప్రజాప్రతినిధులతో ఈ నెల 3న సమావేశం నిర్వహించారు. దీనిని విజయంతం చేసిన మాచవరం సర్పంచ్ భర్త నాగాబత్తుల వెంకటసుబ్బారావును రాజేంద్రప్రసాద్‌తో పాటు సర్పంచ్‌ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మీముత్యాలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌లు జల్లి బాలరాజు, సలాదిబుచ్చిరాజు సత్కరించారు.

'కోతుల బెడద నుంచి కాపాడండి'

పి.గన్నవరం, జనవరి 23: కోతుల బెడద నుంచి తమ పంట పొలాలను కాపాడాలని వై.కొత్తపల్లి, ఆర్.ఏనుగుపల్లి, కె.ఏనుగుపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని స్పందనలో అధికారులకు అందజేశారు. గ్రామాల్లో, పంట పొలాల్లో 150 నుంచి 200 కోతులు గుంపులుగా సంచరిస్తున్నాయన్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు ఏటిగట్టుపై రాకపోకలు సాగించే మహిళలపై దాడి చేస్తున్నాయన్నారు. పంట పొలాలను నాశనం చేస్తున్నాయని వివరించారు. అధికారులు స్పందించి కోతులను పట్టుకుని ఏజెన్సీకి తరలించాలని కోరారు.

ప్రజా సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలి

అయినవిల్లి, జనవరి 23: అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి కోరారు. మంగళవారం ఆమె అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. నేదునూరులో 4వేల ఎకరాల్లో సాగునీటి సరఫరా సక్రమంగా లేక నేటికీ వరినాట్లు పడలేదని ఎంపీటీసీ కళ్లేపల్లి సుబ్బరాజు పేర్కొన్నారు. మడుపల్లి, నేదునూరు, చింతనలంక గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పలువురు ప్రస్తావించారు. ముక్తేశ్వరం ప్రధాన పంట కాల్వ గుర్రపుడెక్కతో మూసుకుపోయిందని, తొలగింపునకు నీటిపారుదల అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్.మూలపొలం సర్పంచ్ బొబ్బా ప్రభాత్ సూచించారు. సమావేశంలో ఎంపీడీవో తాడి వెంకటాచార్య, ఈవోపీఆర్డీ మోహన్‌కృష్ణ, డిప్యూటీ తహసీల్దారు అశోక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రూట్ మ్యాప్ పరిశీలన

మలికిపురం, జనవరి 23: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేసి రిమాండుకు తరలించిన సందర్భంలో విశ్వేశ్వరాయపురానికి చెందిన చెల్లుబోయిన నరసింహమూర్తి, గూడపల్లికి చెందిన సరెళ్ల పెద్దిరాజు గుండె పోటుతో మృతి చెందారు. ఆ కుటుంబాలను పరామర్శించి ఆర్థికంగా ఆదుకోవడానికి 'నిజం గెలవాలి' పేరిట నారా భువనేశ్వరి గురువారం మధ్యాహ్నం మలికిపురం మండల పర్యటనకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రూట్ సర్వేకు వచ్చిన టీడీపీ ప్రత్యేక బృందానికి మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు వివరాలు అందజేశారు. సర్పంచ్ చెల్లుబోయిన హెలీన, గెడ్డం సింహా, చాగంటి స్వామి, అనిశెట్టి సత్యనారాయణ, రుద్రరాజు బంగార్రాజు, వలవల శేఖర్, హరికృష్ణ పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ'

కొత్తపేట, జనవరి 23: వైసీపీ అసమర్థ పాలనతో గ్రామాలు కనీస మౌలిక వసతులకు కూడా నోచుకోలేదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం పలివెలలో 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. నాయకులు చవల జగన్నాథం, సాదే శ్రీను, నల్లా వెంకటరమణ, గొలకోటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మండపేట: మండలంలోని ఏడిద, ఏడిద సావరం గ్రామాల్లో మంగళవారం 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమాల్లో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం ప్రజలపై పన్నులు, అప్పులు భారం మోపడం తప్ప చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. రెండు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా పోలమ్మ తీర్థం

రాయవరం, జనవరి 23: రాయవరం గ్రామస్తుల ఇలవేల్పు పోలమ్మ అమ్మవారి తీర్థం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగింది. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత అమ్మవారి మూలవిరాట్‌కు వెండి కవచంతో అలంకరణ జరిపి ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అమ్మ వారిని దర్శించుకున్నారు. ఎస్ఐ జి.నరేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించి ట్రాఫిక్‌ను మళ్లించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నౌడు వెంకటరమణ, భక్తులు పాల్గొన్నారు.

'జయహో బీసీ' సమావేశం

రామచంద్రపురం, జనవరి 23: శీలంవారి సావరంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 'జయహో బీసీ' సమావేశం నిర్వహించారు. లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. ప్రముఖ పారిశ్రామికవేత్త మేడిశెట్టి శేషారావు, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు కడియాల రాఘవన్, రాయపురెడ్డి రాజా, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కుల రిష్వంత్‌రాయ్, వనుం చంటి, ఖండవిల్లి విజయ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: గుంటూరు కారం
వెంకటరమణ	: సైంధవ్
శ్రీలలిత	: గుంటూరు కారం
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: నాసామిరంగ
రమా	: గుంటూరు కారం
గణపతి	: నాసామిరంగ
వెంకటపద్మావతిస్క్రీన్-1	: గుంటూరు కారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	: సలార్

జిల్లాలో 21 ఉన్నత పాఠశాలల్లో పీఎంశ్రీ పథకం


డీఈవో కమలకుమారి

అమలాపురం రూరల్, జనవరి 23: ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ రైజింగ్ ఫర్ ఇండియా (పీఎంశ్రీ) పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధి వేగవంతంగా జరుగుతోందని డీఈవో ఎం.కమలకుమారి తెలిపారు. అమలాపురం మండల విద్యా శాఖ కార్యాలయంలో ఎంఈవో-2 దుర్గాదేవి అధ్యక్షతన పాఠశాలల హెచ్‌ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. పీఎంశ్రీ పథకం ద్వారా జిల్లాలోని 21 ఉన్నత పాఠశాలల్లో ఆటస్థలాల అభివృద్ధి, సైన్స్ ల్యాబ్‌ల ఏర్పాటు తదితర మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. సమగ్ర శిక్షా ఏఎంవో పి.రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో ఏపీ ఆర్ఈఎస్‌డబ్ల్యు సమనస, అనాతవరం, కొత్తపేట, గొల్లవిల్లి, హసన్‌బాద, కాట్రేనికోన, మామిడికుదురు ఉన్నత పాఠశాలలకు కెమిస్ట్రీ ల్యాబ్‌ల నిర్మాణం కోసం ఒక్కో పాఠశాలకు రూ.15.58 లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయన్నారు. ఆట స్థలాల అభివృద్ధికి ఒక్కో పాఠశాలకు రూ.5 లక్షలు మంజూరు చేశారన్నారు. సమగ్ర శిక్షా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిధులు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. హెచ్‌ఎంలు లేవనెత్తిన పలు సాంకేతిక సందేహాలను ఇంజనీరింగ్ అధికారులు నివృత్తి చేశారు. సైట్ ఇంజనీర్లు సూర్యనారాయణ, నారాయణరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అమలాపురం రూరల్, జనవరి 23: పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం జరిగింది. హెచ్‌ఎం జి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అలనాడు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు కామన గణేష్, ముషిణి సత్యనారాయణ, చిక్కాల శ్రీదేవి, రంకిరెడ్డి సుబ్రహ్మణ్యం, వీరా సత్యనారాయణ, కొప్పిశెట్టి రమణలకు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతి గదుల్లో ఆనందోత్సాహాలతో గడిపారు. పాఠశాల అభివృద్ధికి రూ.40వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ అందజేశారు. పూర్వ విద్యార్థులు నల్లా వెంకటేశ్వరరావు, కట్టా వెంకటరమణ, అల్లాడ రవి, మట్టపర్తి శ్రీనివాసరావు, అరిగెల వరకుమార్, రాయుడు శ్రీనివాసరావు, పాలగుమ్మి శ్రీరామ్, బొక్కా రత్నశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ప్రసాద్



కాట్రేనికోన, జనవరి 23: కాట్రేనికోనకు చెందిన సత్తాల ప్రసాద్ టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు అందాయి. ప్రసాద్ గతంలో ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యునిగా, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా, బూత్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు.

యానాం సిబ్బందికి పుదుచ్చేరి యూనియన్ మద్దతు

యానాం, జనవరి 23: యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి పుదుచ్చేరి ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధి సెల్వన్ మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వ పెద్దలు, అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. యూనియన్ ప్రతినిధి రాజేంద్రన్, యానాం సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయలో చిత్రలేఖనం పోటీ

యానాం, జనవరి 23: ప్రధాని నరేంద్ర మోదీ రాసిన ఎగ్జామ్ వారియర్స్ పుస్తక ప్రేరణతో పరీక్షా పే చర్చలో భాగంగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నవోదయ విద్యాలయలో మంగళవారం చిత్రలేఖనం పోటీ నిర్వహించినట్లు ప్రిన్సిపల్ టీవీఎస్ ప్రకాశరావు తెలిపారు. యానాంలోని పలు విద్యాలయాల్లో 9 నుంచి 12వ తరగతి చదువుతున్న 50మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారితో పాటు ఉపాధ్యాయులను, న్యాయనిర్ణేతలను, కార్యక్రమ సమన్వయకర్తలను ప్రిన్సిపల్ అభినందించారు.

దిశ యాప్‌పై అవగాహన

రావులపాలెం, జనవరి 23: విద్యార్థి దశ నుంచే దిశ యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని దిశ డీఎస్పీ సుంకర మురళి కోరారు. స్థానిక భాష్యం పాఠశాలలో విద్యార్థులకు దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. ఐ.శ్రీనివాస్, జి.శివరామ్, కె.భవాని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రుద్ర హోమం

ఐ.పోలవరం, జనవరి 23: పుష్య మాసం ఆరుద్ర నక్షత్రం మహాపర్వదినాన్ని పురస్కరించుకుని మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రుద్ర హోమాన్ని ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, మండపారాధన, హోమం అనంతరం పూర్ణాహుతి జరిపారు. ఆలయ చైర్మన్ పెన్మెత్స వాసురాజు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

టీడీపీలో పలువురి చేరిక

కొత్తపేట, జనవరి 23: ఆలమూరు మండలం చింతలూరు పంచాయతీ 10, 12 వార్డుల సభ్యులు గంటా రాంబాబు, పల్లిటి నానిబాబు ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. వాడపాలెంలోని పార్టీ కార్యాలయం మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు వారికి పార్టీలు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. వైట్ల శేషబాబు, వైట్ల గంగరాజు, గణేష్, చింతలూరు ఫణికుమార్, బుంగా శ్రీనివాస్, మట్టా రాంబాబు, దంతుమళ్ల రాంబాబు, తేజ, తాళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, బండారు విజయం కాంక్షిస్తూ పాదయాత్ర

ఆలమూరు, జనవరి 23: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో చంద్రబాబునాయుడు, కొత్తపేట నియోజకవర్గంలో బండారు సత్యానందరావు విజయాన్ని ఆకాంక్షిస్తూ మండలంలోని చింతలూరు టీడీపీ నేతలు మంగళవారం వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి పాదయాత్ర నిర్వహించారు. చింతలూరు ఫణికుమార్, వైట్ల శేషబాబు, వైట్ల గంగరాజు, దండంగి మమత, వాకా సుబ్బలక్ష్మీదేవి, దొమ్మేటి రామకృష్ణ, బుంగ శ్రీనివాస్, శివన్నారాయణ, చనుమోలు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేదిపాలెంలో చోరీ

అంతర్వేది, జనవరి 23: సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలేనికి చెందిన చేరుకోట రాజేష్ సోమవారం ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగులకొట్టి లోనికి ప్రవేశించి రెండు బీరువాల్లో ఉన్న సుమారు ఐదు కాసుల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. సఖినేటిపల్లి ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి అమలాపురం నుంచి క్లూస్ టీమును రప్పించి వేలిముద్రలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

ఓటర్ల తుది జాబితా వెల్లడి

రామచంద్రపురం, జనవరి 23: రామచంద్రపురం ఆర్డీవో ఎస్.సుధాకర్ మంగళవారం గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో జనవరి 6 నుంచి 23 వరకు ఆన్‌లైన్‌లో ఫారం-6 దరఖాస్తులు 274, ఫారం-7 దరఖాస్తులు-77, ఫారం-8 దరఖాస్తులు 256 వచ్చాయని తెలిపారు. మొత్తం క్లెయిమ్స్ వివరాలు, పెండింగు వివరాలపై రాజకీయ నాయకులకు వివరణ ఇచ్చి కాపీలను అందజేశారు. నియోజకవర్గంలో తుది జాబితా ప్రకారం పురుషులు 99,361, స్త్రీలు 1,00, 785 మంది మొత్తం ఓటర్లు 2,00,147 మంది అని చెప్పారు. రామచంద్రపురం, కాజులూరు, కె.గంగవరం మండలాలకు చెందిన ఓటరు నమోదు సహాయ అధికారులైన తహసీల్దార్లు, రామచంద్రపురం మున్సిపల్ కమిషనరు కె.శ్రీకాంత్‌రెడ్డి, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఓటర్లకు ఇబ్బంది కలగకుండా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి'

మండపేట, జనవరి 23: ఓటర్లకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని మండపేట నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజరు మదన్‌మోహన్‌రావు అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన మున్సిపల్ కమిషనరు రామ్‌కుమార్, తహసీల్దారు రాజేశ్వరరావులతో కలిసి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. నియోజకవర్గంలోని 229 పోలింగ్ కేంద్రాల్లో సమస్యాత్మక కేంద్రాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను కోరారు. సమావేశంలో మూడు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.